క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో మంత్రి వేణు



స్వామి చిత్రపటం అందుకున్న మంత్రి వేణు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మంత్రి వేణుకు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు సుదర్శనం రమేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. వెంట పారిశ్రామిక వేత్త జంపన సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు



నగరంలో పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు

మామిడికుదురు: మొహరం సంతాప దినాల్లో భాగంగా శనివారం నగరం గ్రామంలో పీర్లను ఊరేగించారు. మామిడికుదురులోని ఇమామ్ హుస్సేన్ పంజా, సర్కిల్ భాష స్వగృహం, బడేబీబీ పంజా, అన్సారి పంజాల్లో ఈ సందర్భంగా మజ్లిస్‌లు జరిగాయి. మత ప్రబోధకులు సయ్యద్ మహ్మద్ అలీజాఫరీ మజ్లిస్ ఆలపించారు. పలు గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని హజరత్ ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి ఘనంగా నివాళులర్పించారు.

అబ్బురపరచిన విద్యార్థుల విన్యాసం



భారతదేశం చిత్రపటంగా ఏర్పడిన విద్యార్థులు

మామిడికుదురు: పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండా స్వీకరణ దినోత్సవాన్ని శనివారం మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. దీప్తి స్కూల్ విద్యార్థులు భారతదేశం చిత్రపటం బొమ్మ గీసి దాని చుట్టూ నిల్చుని మహనీయులకు నివాళులర్పించిన దృశ్యాలు అబ్బురపర్చాయి. జాతీయ జెండాను ప్రదర్శించి దానికి సెల్యూట్ చేస్తూ విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, హెచ్ఎం యక్కలదేవర నాగన్నబాబు, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఉపాధ్యాయులు, విద్యార్థుల సాయం



లత కుటుంబానికి సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం: అగ్నిప్రమాదంలో ఇంటికి నిప్పంటుకుని సర్వం కోల్పోయిన విద్యార్థికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రూ.16,100 ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన మీసాల లత స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీఏ చదువుతుంది. ఈనెల 12న జరిగిన అగ్ని ప్రమాదంలో లత కుటుంబం నిరాశ్రయులు కావడంతో ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది రూ.13,500, కళాశాల విద్యార్థి సహాయ నిధి నుంచి రూ.2,600 మొత్తంగా రూ.16,100 నగదును సాయంగా అందజేశారు. ఈ సాయాన్ని లత కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేసినట్టు లైబ్రేరియన్ ఎస్.జానకీరామ్ తెలిపారు.

దివ్యాంగురాలికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన దివ్యాంగురాలు గొల్ల విజయకుమారికి శనివారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఇటీవల విజయ కుమారికి ప్రమాదవశాత్తూ పోలియో సోకిన కాళ్లకు ఫ్రాక్చర్ అయింది. ఈ విషయంపై రత్న చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, వైస్ ఎంపీపీ రాపాక దీవెనకుమారి స్పందించి పై సాయం సమకూర్చారు. దీనిని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆమెకు ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

- వరద ప్రవాహంతో తీవ్రమైన నదీపాతం
- ముంపునకు గురైన కాజ్‌వేలు

మామిడికుదురు: గోదావరి వరద ప్రవాహానికి తీర గ్రామాల్లో నదీపాతం తీవ్రమైంది. అప్పనపల్లిలో గోదావరి కోత నివాస గృహాన్ని సమీపించడంతో శనివారం స్థానికులు ఆ ఇంట్లోని సామాన్లు తీసుకుని ఇంటిని ఖాళీ చేసి వేరే చోటకు వెళ్లిపోయారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి గ్రామాల్లో గోదావరి వరద ఉధృతికి సారవంతమైన భూములతో పాటు కొబ్బరి చెట్లు నదిలో కూలిపోయాయి. అప్పనపల్లి–పెదపట్నంలంక గ్రామాల సరిహద్దులోని పాటు రేవును వరద నీరు ముంచెత్తింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు బి.దొడ్డవరం మీదుగా రాకపోకలు సాగించారు. పాశర్లపూడి ఏటి గట్టు దిగువన ఉన్న కాజ్‌వేకు రెండు వైపులా వరద నీరు పోటెత్తింది. మరింత ప్రవాహం పెరిగిన పక్షంలో కాజ్‌వే ముంపుబారిన పడే ప్రమాదం ఉందని లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టిందన్న సమాచారంతో తీర గ్రామాల ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

కాజ్‌వేను ముంచెత్తిన వరదనీరు

అయినవిల్లి: వరద నీరు మండలంలోని పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలను ముంచెత్తింది. అయినవిల్లిలంక వెదురుబిడిం కాజ్‌వే వద్ద రోడ్డుపై నాలుగు అడుగులు మేర వరద చేరింది. కాజ్‌వేపై వరద నీరు చేరుడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ వంతెనపైన అడుగు మేర వరద ప్రవహిస్తుంది. ఇక్కడి శ్మశాన వాటిక చుట్టూ వరద చేరడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముక్తేశ్వరం–కోటిపల్లిరేవులో వరద నీరు చేరడంతో పడవలు, పంట్లు రాకపోకలను నిలిపివేసిన విషయం పాఠకులకు విదితమే. లంక గ్రామాలైన వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, తొత్తరమూడి, కె.పెదలంక, శానపల్లిలంక, కొండుకుదురులంక, పొట్టిలంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలోకి వరద నీరు చెరింది. రైతులు ఇప్పటికే వ్యవసాయ ఉత్పత్తు, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి శనివారం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ గ్రామాలకు చెందిన విద్యార్థులు నదీపాయ దాటి జి.పెదపూడి గ్రామంలోని హైస్కూల్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద ఉధృతి తగ్గే వరకూ లంకలోని ప్రాథమిక పాఠశాలల్లోనే వారికి విద్యాబోధన చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. బూరుగులంక రేవులో రెండు ఇంజిన్‌బోట్లు ఏర్పాటు చేశారు. అక్కడ రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని నియమించారు. ఇంజిన్ పడవల్లో 40 లైఫ్ జాకెట్లు ఏర్పాటు చేశారు. లైఫ్ జాకెట్లు వేసుకుంటేనే బోటులో ఎక్కేందుకు అనుమతిస్తున్నారు. లంకలో ఒక మినీ బజార్‌ను, కూరగాయల దుకాణాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఠాగూర్ తెలిపారు. అలాగే ఉభయగోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

ఆత్రేయపురం: గౌతమీ, వశిష్టా గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఉధృతంగా ప్రవహించిన గోదావరి శనివారం తగ్గడంతో నెమ్మదిగా నీటిమట్టం తగ్గుతుంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 10.08 అడుగులకు చేరుకోవడంతో 8,56,185 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ జేఈ అద్దంకి సాయిరామ్ తెలిపారు. అలాగే ప్రధాన కాలువలకు 12,100 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు.



బొబ్బర్లంక వద్ద నిలకడగా ఉన్న గోదావరి



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి



ముంపునకు గురైన అప్పనపల్లి–పెదపట్నంలంక పాటు రేవు



అయినవిల్లిలంక వెదురుబిడిం కాజ్‌వే వద్ద వరద

వరదనీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

మండలంలోని చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే వరద ఉధృతికి శుక్రవారం ఉదయం నీట మునిగింది. అధికారులు మధ్యాహ్నం బోట్లు ఏర్పాటు చేయడంతో, వాటిపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కనకాయలంక గ్రామం పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోకి వస్తుంది. తమ మండలానికి వెళ్లాలంటే దొడ్డిపట్ల రేవు దాటాలి. అయితే ఆ గ్రామానికి రోడ్డు కనెక్టివిటీ మాత్రం పి.గన్నవరం మండలం చాకలిపాలేనికి ఉంది. దీంతో కనకాయలంక గ్రామ విద్యార్థులు కోనసీమ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్ వే వద్ద వరద ఉధృతిని ఎమ్మెల్యే చిట్టిబాబు శనివారం పరిశీలించారు.

దోషులను ఉరి తీయాలి

మలికిపురం: మణిపూర్‌లో సమాజం సిగ్గుపడే విధంగా ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి నగ్నంగా ఊరేగించి, వాళ్లపై అత్యాచారం చేయటం హేయమైన చర్య అని శనివారం మలికిపురంలో విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. అలాగే మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లలో పదుల సంఖ్యలో ప్రజలు చనిపోవడంతో పాటు వందలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇంత జరుగుతున్నా వారిపై కఠిన చర్యలు లేవని మండిపడ్డారు. వారిపై వెంటనే కఠిన శిక్షలు అమలు చేసి దోషులను ఉరి తీయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. నిరసనలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

26న ఏపీఈపీడీసీఎల్ అవగాహన సదస్సు

రాజోలు: ఏపీఈపీడీసీఎల్ కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) కార్యక్రమం ఈ నెల 26న రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సదస్సు జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు అవగాహన సదస్సుకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

స్లూయిజ్‌లు నిర్మించాలి

అంబాజీపేట: వరదల సమయంలో వైనతేయ గోదావరి నుంచి ముంపు బారిన పడకుండా తొండవరం ఏటిగట్టు వద్ద స్లూయిజ్ నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలకు స్థానికులు వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన వాకలగరువులో శనివారం వారు పర్యటించారు. స్లూయిజ్ లేకపోవడంతో వరద సమయంలో వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాలు నీట మునుగుతున్నాయన్నారు. తొండవరం, వాకలగరువు ఏటిగట్టు వద్ద బ్రిటిష్ కాలంలో స్లూయిజ్ నిర్మించారన్నారు. ఈ స్లూయిజ్‌ను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో వాటి తలుపులు పాడై తెరచుకోవడం లేదన్నారు. పాడైన స్లూయిజ్‌ను నూతనంగా నిర్మించి ముంపుబారిన పడకుండా చూడాలని ఎంపీపీ, జెడ్పీటీసీలను కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు వివరించి సమస్య పరిష్కరిస్తామని ఎంపీపీ, జెడ్పీటీసీలు తెలిపారు. సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు వారి వెంట ఉన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి

- మాచవరం, మేడిచర్లపాలెంలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కొండేటి, రాపాక

అంబాజీపేట: పార్టీ రహితంగా, కుల మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యన గడపగడపకూ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు చేకూరిన లబ్ధిని లెక్కలతో సహా వివరించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అందుతున్న సంక్షేమ ఫలాలు చరిత్రాత్మకమని, యావత్ భారతదేశం ఏపీ వైపు చూసే పరిస్థితులు జగనన్న ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్రోచర్లను అందించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, మైలా ఆనందరావు, మట్టపర్తి హరి, కుసుమ శ్రీను, అప్పన శ్రీను పాల్గొన్నారు.



మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

వికేంద్రీకరణతోనే ప్రజలందరికీ న్యాయం

మలికిపురం: రాష్ట్రంలో పరిపాలనా వికేంద్రీకరణతోనే ప్రజలందరికీ న్యాయం అందుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం మండలంలోని మేడిచర్లపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ మూడు రాజధానుల ఏర్పాటుకు సీఎం జగన్ తీసుకున్న చర్యల వల్ల అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయన్నారు. ఇప్పటి వరకూ గత ప్రభుత్వాలు తీసుకున్న మూస పద్ధతులు, మోసపూరిత విధానాల వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్ట పోయాలని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రతి పక్షాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రం వెనకబడిపోతుందన్నారు. గడప గడపకూ కార్యక్రమం వల్ల ప్రజల వద్దకు అధికారులు వచ్చి ప్రజలు ఇచ్చే సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీరబ్రహ్మాజీరావు, కేఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, కానూరి బాబి, గుబ్బల పుల్లయ్య, మేడిచర్ల వెంకటేశ్వరరావు, కుసుమ బంగారం, నల్లి ప్రసాదరావు, చింతా రాజబాబు, కొల్లాబత్తుల అశోక్ కుమార్ పాల్గొన్నారు.



మేడిచర్లపాలెంలో లబ్ధిదారులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సీఎం జగన్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

ఆత్రేయపురం: సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం వల్లే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు సమస్యలుపై పోరాడేందుకు అవకాశం లేకుండా ప్రభుత్వం గడప వద్దకే వచ్చి ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ సేవలందిస్తుందన్నారు. వద్దిపర్రులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాలను ప్రతీ గడపకూ వెళ్లి వివరించారు. లబ్ధిదారుల గణాంకాలతో సహా వివరించి మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంక్షేమ పతకాలు పొందేందుకు కావాల్సిన సర్టిఫికెట్లు పొందాలన్నారు. గడచిన నాలుగేళ్లలో గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.10,42,12,818 లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మాజీ సర్పంచ్ కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నాతిబుజ్జి, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, గాదిరాజు రామకృష్ణంరాజు వివిధ శాఖల అధికారుల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.



వద్దిపర్రులో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

పేదలకు మంచి చేయాలన్నదే సీఎం ధ్యేయం

అంబాజీపేట: పేదలకు మంచి చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నందంపూడిలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారుల పర్యవేక్షణలో సర్పంచ్ పితాని మంగాదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సీఎం జగన్ చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, పితాని వీరస్వామి, వెన్నపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


రెండు గ్రామాల్లో..

అయినవిల్లి: జగనన్న సురక్షలో భాగంగా పేదలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేయడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం మండలంలోని వెలువలపల్లి, విలస–1 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్పంచులు బొంతు మణి, కుసుమ లిల్లీ మంగేష్కర్ అధ్యక్షతన జరగ్గా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని నార్కెడ్‌మిల్లి, కట్టుంగ గ్రామాల్లో సర్పంచ్‌లు పోచిరాజు బాబురావు, కాయల జగన్నాథం అధ్యక్షతన శనివారం జగన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, జెడ్పీటీసీ బోణం సాయిబాబా, మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీడీఓ నాతిబుజ్జి, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన 4324 ధ్రువపత్రాలను ప్రజలకు అందించారు.

ఆలయానికి రూ.36 వేల విరాళం



ఆలయానికి విరాళం అందించిన దాతలు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయానికి విజయవాడ రూరల్ మండలం గుణదలకు చెందిన కనకదుర్గాప్రసాద్, వెంకట సత్యవాణి దంపతులు రూ.36 వేల విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. 6 నెలల కాలానికి నిత్య దీపారాధన, నూనె కొనుగోలు నిమిత్తం అందించినట్లు తెలిపారు.


కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులను తైలాభిషేకాలు, సర్వదర్శనాలకు అనుమతించారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ సింగం రాధ, సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.92,984 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.11,412 ఆదాయం వచ్చినట్టు ఈఓ రాధ తెలిపారు. సిబ్బంది, గ్రామస్తులు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

కాలువలో జారిపడి లష్కర్ మృతి



కుడుపూడి శ్రీనివాసరావు (ఫైల్)

అంబాజీపేట: పంట కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న ఇరిగేషన్ లష్కర్ శనివారం ప్రమాదవశాత్తూ ముక్కామల ప్రధాన పంట కాలువలో పడి మృతి చెందాడు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన కాలువల్లోనూ నీటి మట్టం పెరిగి ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో ముక్కామల లాకు వద్ద విధి నిర్వహణలో ఉన్న లష్కర్ కుడుపూడి శ్రీనివాసరావు (58) లాకులకు అడ్డుగా ఉన్న చెత్త తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి పంటకాలువలో పడి కొట్టుకుపోయాడు. సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఈఈ, ఏఈలు లాకుల వద్దకు చేరుకుని నీటిమట్టాన్ని తగ్గించి గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో లాకు సమీపానే శ్రీనివాసరావు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోండి

అంబాజీపేట: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియ ఈ నెల 21 నుంచి ప్రారంభమైందని సవరణలు ఉంటే చేసుకోవాలని తహసీల్దార్ టి.మంగతాయారు అన్నారు. అంబాజీపేటలో బూత్ లెవెల్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేయాలన్నారు. సర్వేలో భాగంగా నూతన ఓటర్ల నమోదు, అడ్రసు, వయస్సు మార్పు, సవరణ చేయడంతో పాటు మరణించిన వారిని తొలగించుటకు కావాల్సిన సంబంధిత ఫారాలను పక్కాగా పూర్తి చేసి ఓట్లను తొలగించాలన్నారు. సవరణలను అన్ని రాజకీయ పార్టీలు సునిశితంగా పరిశీలించి సర్వే అధికారులకు సహకరించాలన్నారు.

కేశవదాసుపాలెంలో ప్రజాసంఘాల నాయకుల పర్యటన

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో ప్రజాసంఘాల నాయకులు శనివారం పర్యటించారు. గ్రామంలోని ఉండపల్లి వారి మెరకలో ఇటీవల ఉపాధి నిధులతో తవ్వకాలు చేసిన రెండు మంచినీటి చెరువులను వారు పరిశీలించారు. చెరువులకు నీటి సరఫరాకై గతంలో తవ్విన పంట బోదె కలుషితం కావడం, ప్రత్యామ్నాయంగా చెరువుల పక్క నుంచి నీరు వెళ్లే మార్గం విషయంపై తలెత్తిన సమస్యలపై నిజ నిర్ధారణ నిమిత్తం స్థానిక ప్రజాప్రతినిధులు నుంచి వివరాలు సేకరించినట్టు బూసి జాన్‌మోషె, ముత్యాల శ్రీనివాసరావు, చింతా సత్యలు తెలిపారు. అక్రమ ఆక్వా సాగు నీటిని పై రెండు చెరువుల్లోకి గండి కొట్టాలని కొంత మంది ప్రయత్నం చేస్తున్నారని, అలా జరిగితే అధికారులు బాధ్యత వహించాలన్నారు. అక్రమ ఆక్వా సాగు వల్ల, డ్రెయినేజీ నీరు వల్ల చెరువులకు తవ్విన పంట బోదె కలుషితమైందని, ఈ తరుణంలో ప్రత్యామ్నాయ మార్గంగా చెరువుల పక్క నుంచి నీరు వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేశారన్నారు. కాగా గండి కొట్టాలని ఆక్వా సాగుదారుల ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారని, మధ్య మార్గంగా గండి కొట్టకుండా ఉండాలంటే ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన బోదె చుట్టూ రివెట్‌మెంట్ కట్టాలని ఆక్వా సాగుదారులు డిమాండ్ చేస్తున్నారని, ఇందుకు అయ్యే ఖర్చులు పంచాయతీ భరించే పరిస్థితి లేదన్నారు. తాము సేకరించిన విషయాన్ని పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు అన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం



హరీష్ కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి పేదరికంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్న ఒక క్షతగాత్రుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మండలంలోని ఊబలంకకి చెందిన సజ్జా హరీష్, గత నెల మూడున హరీష్ తన నాలుగేళ్ల కుమారుడితో కలసి బైక్‌పై గొల్లగూడెం బంధువుల ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన హరీష్‌కు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయితే పేదరికంతో ఇబ్బంది పడుతున్న హరీష్ కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో వైద్యం చేయించలేక ఇంటికి తీసుకువచ్చారు. అతని పరిస్థితి చూసిన కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యురాలు ఆదిలక్ష్మి ఇతనికి సాయం చేయాలని సేవా సమితి సభ్యులను కోరారు. దీంతో హరీష్‌కు వైద్య ఖర్చుల కోసం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అతని కుటుంబ సభ్యులకు అందజేశారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

అయినవిల్లి: శానపల్లిలంక గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. విలస–2 సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్షలో శానపల్లిలంకకి చెందిన పాలెపు గోపాలకృష్ణ, రచ్చ వీరబాబు, కుంచె రామారావు, పల్లి ఈశ్వరరావు, కుంచె మణికుమార్‌లు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

పెరటి సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

సఖినేటిపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పెరటి సాగుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని, ఔత్సాహిక రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆత్మ పీడీ జ్యోతిర్మయి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మండలంలోని అంతర్వేదిపాలెంలో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్ కమ్యూనిటీ నర్సరీలను శనివారం ఆమె పరిశీలించారు. రైతులతో ఆమె మాట్లాడి తగిన సూచనలు అందించారు. ఆమె మాట్లాడుతూ కమ్యూనిటీ నర్సరీల ద్వారా వివిధ పంటలకు సంబంధించిన నారును పెంచి గ్రామంలోని ఇతర రైతులకు మరియు ప్రజల ఇంటి వద్ద కూరగాయలు వేసుకొనుటకు నారు తయారు చేయడమే కాక వాటిని మార్కెటింగ్ నిమిత్తం వేసుకోవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల పొలంగట్లపై పలు పంటల సాగు విధానాలను అనుసరించుటకు వేస్తున్న ఈ నారులు రైతులకు విక్రయించుకునేందుకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. కమ్యూనిటీ నర్సరీలను అభివృద్ధి చేయడం ద్వారా విత్తనం ఖర్చు మరియు ఇతర ఖర్చులు మొదలుకొని ఒక మొక్క కేవలం నాలుగో వంతు ధరకే లభిస్తుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ జోసఫ్, జోన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు, సిబ్బంది చిట్టి స్వరాజ్, జూలీ, కిరణ్ ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.